సాక్షి కామారెడ్డి

బుధవారం । 7 । ఆగస్టు । 2024



దశలవారీగా అభివృద్ధి

దశలవారీగా గ్రామాలను అభివృద్ధి చేస్తాన ని, ప్రజలు సహకరించాలని జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు కోరారు.

- 9లో ▸



'స్వచ్ఛదనం' విజయవంతం చేయాలి

స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అధికారులకు సూచించారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
35.0 /23.2

ఆకాశం మేఘావృతమవుతుంది. చల్లని గాలులు వీస్తాయి. అక్కడక్కడ ఓ మోస్త రునుంచి భారీ వర్షం కురిసే అవకాశాలు న్నాయి.

న్యూస్‌రీల్

కష్టపడి చదివితేనే భవిష్యత్తు



లింగంపేట: కష్టపడి చదివితేనే చక్కటి భవిష్యత్తు ఉంటుందని డీఈవో రాజు పేర్కొన్నారు. మంగళవారం ఆయన శెట్పల్లి ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. తరగతి గదులలోకి వెళ్లి విద్యార్థులను ప్రశ్నలు అడిగి వారి నైపుణ్యాలను పరిశీలించారు. ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను విన్నారు. విద్యార్థులకు అర్థమయ్యేలా బోధనోపకరణాలను ఉపయోగించి చదువు చెప్పాలని సూచించారు. అనంతరం పాఠశాల పరిసరాలను పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించి, భోజనాన్ని రుచికరంగా వండాలని ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో నరేశ్, ఎంపీవో మలహరి, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

సింగితం రిజర్వాయర్ గేటు ఎత్తివేత

నిజాంసాగర్: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు మహమ్మద్‌నగర్ మండలంలోని సింగితం రిజర్వాయర్‌లోకి మంగళవారం 324 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. రిజర్వాయర్ 416.550 మీటర్ల పూర్తిస్థాయి నీటితో నిండుకుండలా ఉండడంతో ఒక గేటు ఎత్తి 324 క్యూసెక్కుల నీటిని నిజాంసాగర్ ప్రాజెక్టు ప్రధాన కాలువలోకి విడుదల చేస్తున్నారు.

కామారెడ్డి సబ్ రిజిస్ట్రార్‌గా కృష్ణ



కామారెడ్డి క్రైం: కామారెడ్డి సబ్ రిజిస్ట్రార్‌గా కృష్ణ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేసిన శ్రీలత మెదక్‌కు బదిలీ అయిన విషయం తెలిసిందే. ఆమె స్థానంలో కృష్ణ చేర్యాల నుంచి బదిలీపై వచ్చారు. నూతన సబ్ రిజిస్ట్రార్‌ను పట్టణానికి చెందిన పలువురు నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

'హిందువులు ఐక్యంగా ఉండాలి'



కామారెడ్డి అర్బన్: హిందువులు కులాలకు అతీతంగా ఐక్యంగా ఉండాలని విశ్వహిందూ పరిషత్ తెలంగాణ ప్రాంత అధ్యక్షుడు నరసింహమూర్తి సూచించారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని జన్మభూమి రోడ్డులో వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ కార్యాలయం 'బజరంగీ నిలయం'ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ సభ్యులతో వారానికి ఒకసారైనా దేవాలయాలను సందర్శించాలని, హనుమాన్ చాలీసా పారాయణం చేయాలని, భజనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ ప్రాంత సహ కార్యదర్శి గణపురం రాజేశ్వర్‌రెడ్డి, క్షేత్ర సత్సంగ్ ప్రముఖ్ పండరినాథ్, విభాగ్ కార్యదర్శి తుమ్మల కృష్ణ, జిల్లా అధ్యక్షుడు గోపాలకృష్ణ, ఉపాధ్యక్షుడు గంగారెడ్డి, కార్యదర్శి బొల్లి రాజు, ప్రచార ప్రముఖ్ శ్రీకాంత్‌రావు, మాతృశక్తి జిల్లా సంయోజక్ రాజశ్రీ, వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ ప్రతినిధులు వెంకటస్వామి, వంగ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీడీఎంఏ ఎస్ఈ పర్యటన




బాన్సువాడ: బాన్సువాడలోని మల్టీ జనరేషన్, చిల్డ్రెన్ పార్కులను మంగళవారం కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఎస్ఈ అన్నపూర్ణ సందర్శించారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ఆమె కల్కి చెరువు కట్ట (మినీ ట్యాంక్ బండ్)ను, 17వ వార్డులో ఉన్న వాటర్ ట్యాంక్‌లను పరిశీలించారు. పార్కులలో మొక్కలు నాటారు. ఆమె వెంట మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, ఇన్‌చార్జి కమిషనర్ శ్రీహరి రాజు, డీఈ సంతోష్, ఏఈ శ్రీకాంత్, కౌన్సిలర్లు అమేర్, కనుకుట్ల రాజు తదితరులున్నారు.

నెత్తుటి మరకలు

■ భూమి విషయంలో తండ్రీ కొడుకుల మధ్య నెలకొన్న వివాదంలో కన్నతండ్రే కాలయముడిగా మారాడు. కొడుకుపై కర్రతో దాడి చేసి కొట్టి, గొంతు నులిమి చంపాడు. అనంతరం మృతదేహాన్ని ఈడ్చుకుంటూ వెళ్లి కాలువ వద్ద పడేశాడు. పక్కన మద్యం సీసాలు పెట్టి, అతిగా మద్యం సేవించి మరణించినట్లు నమ్మించే ప్రయత్నం చేశాడు. ఈ ఘటన జూన్ 28న ఎల్లారెడ్డి బల్దియా పరిధిలోని గండిమాసానిపేటలో చోటు చేసుకుంది.

■ పాత కక్షలతో ఓ వ్యక్తిని దారుణంగా హతమార్చిన సంఘటన అడ్లూర్ ఎల్లారెడ్డిలో చోటు చేసుకుంది. తన కుమారుడి ఆత్మహత్యకు కారణమయ్యారంటూ హతుడు నిందిస్తుండడంతో కక్ష పెంచుకున్న ముగ్గురు నిందితులు.. జూలై 19న అతడిని అటవీ ప్రాంతంలో చంపి, పూడ్చిపెట్టారు. పోలీసులు ఓ మిస్సింగ్ కేసును విచారిస్తుండగా ఈ హత్యోదంతం వెలుగులోకి వచ్చింది.

■ లైట్ స్విచ్ వేసే విషయంలో అన్నాదమ్ముల మధ్య జరిగిన చిన్నపాటి గొడవ హత్యకు దారితీసింది. క్షణికావేశానికి గురైన తమ్ముడు కత్తెరతో దాడి చేసి గాయపరచడంతో అన్న అక్కడికక్కడే చనిపోయాడు. బాన్సువాడ పట్టణంలో ఈనెల 5వ తేదీ రాత్రి చోటు చేసుకున్న ఈ సంఘటనలో అన్న ప్రాణాలు కోల్పోగా.. తమ్ముడు జైలు పాలయ్యాడు.



- జిల్లాలో పది రోజులకో హత్య
- క్షణికావేశంలో దారుణాలు
- కలవరపరుస్తున్న హత్యోదంతాలు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, వివాహేతర సంబంధాలు ప్రశాంత జీవితాల్లో కల్లోలం సృష్టిస్తున్నాయి. జిల్లాలో వారం పది రోజులకో హత్య జరుగుతోంది. మద్యం మత్తు, క్షణికావేశంలోనే ఎక్కువగా దారుణాలు చోటు చేసుకుంటున్నట్లు స్పష్టమవుతోంది. చాలా కేసుల్లో కుటుంబ సభ్యులే హంతకులు అవుతుండడం కలవరపరుస్తోంది.

ఏడు నెలల్లో 21 కేసులు..

జిల్లాలో ఈ ఏడాది ఇప్పటివరకు 21 హత్య కేసులు నమోదయ్యాయి. కుటుంబ తగాదాలు, ఆస్తి గొడవలతో ఆరు హత్యలు జరిగాయి. భూ తగాదాలు, డబ్బుల గొడవలు తదితర కారణాలతో మరో పది హత్యలు చోటు చేసుకున్నాయి. వివాహేతర సంబంధాలతో మరో ఐదు హత్యలు జరిగాయి. పోలీసు శాఖ అమ్ముల పొదిలో ఉన్న సాంకేతిక పరిజ్ఞానం అస్త్రం నేరస్తులను ఇట్టే పట్టిస్తోంది. ఆధారాలను చెరిపేసినా సరే ఎక్కడో ఒకచోట లభిస్తున్న చిన్న క్లూ పోలీస్ పరిశోధనకు ఉపయోగపడుతోంది. దీంతో నేరస్తులను పట్టుకోగలుగుతున్నారు. అయినా హత్యలు ఆగకపోవడం సమాజాన్ని కలవరపరుస్తోంది.

అయినవారే హంతకులు..

చాలా కుటుంబాల్లో డబ్బులు, ఆస్తుల విషయంలో విభేదాలు గొడవలకు కారణమవుతున్నాయి. కొన్ని సంఘటనల్లో భార్య, భర్తల మధ్య తలెత్తిన విభేదాలు అయితే హత్యకు లేదంటే ఆత్మహత్యకు దారి తీస్తున్నాయి. అన్నదమ్ములు, తండ్రీకొడుకులు, బావ బావమరుదులు, అత్తా కోడళ్లు.. ఇలా అయిన వారే హంతకులుగా మారుతున్నారు. ఆస్తి విషయంలో తలెత్తిన సమస్య కూర్చుండి పరిష్కరించుకోవచ్చు. అవసరమైతే కుల పెద్దలు, బంధువులు, అదీ కాదంటే న్యాయపరంగా కొట్లాడి పరిష్కరించుకోవచ్చు. కానీ ఆవేశంలో దాడులకు పాల్పడుతుండడంతో ప్రాణాలు పోతున్నాయి. ఆయా ఘటనలతో ప్రాణం పోయిన వ్యక్తి కుటుంబం, ప్రాణాలు తీసిన వ్యక్తి కుటుంబం రోడ్డున పడాల్సి వస్తోంది.

వివాహేతర సంబంధాలతో..

జిల్లాలో ఆత్మహత్యలు, హత్యలకు వివాహేతర సంబంధాలూ కారణాలవుతున్నాయి. ఈ ఏడాది ఇప్పటివరకు 21 హత్యలు జరిగితే.. ఇందులో ఐదు హత్యలు వివాహేతర సంబంధాల కారణంగానే జరగడం గమనార్హం. అలాగే ఆత్మహత్య కేసుల్లో కుటుంబ కలహాలను కారణంగా పేర్కొంటున్నా.. చాలా కేసుల్లో వివాహేతర సంబంధాలే ఆత్మహత్యకు కారణమని తెలుస్తోంది. భార్య లేదా భర్త వివాహేతర సంబంధాలు పెట్టుకున్నప్పుడు కుటుంబాల్లో గొడవలు మొదలై పరిస్థితి చేయిదాటిపోతోంది. కొన్నిసార్లు ఒకరిపై ఒకరు దాడులు చేసుకుంటున్నారు. క్షణికావేశంలో జరిగే దాడిలో భర్త లేద భార్య ప్రాణాలు కోల్పోతున్న సంఘటనలూ ఉన్నాయి. మరికొన్ని కేసుల్లో వివాహేతర సంబంధాల విషయంలో భార్యాభర్తల మధ్య గొడవలు జరిగి, విషయం బయటకు పొక్కడంతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

మద్యం మత్తులో..

నిందితులు మద్యం మత్తులో హత్యలకు పాల్పడుతున్నట్లు స్పష్టమవుతోంది. అయితే క్షణికావేశంతో చేస్తున్న పనులతో నెలల తరబడి జైలు ఊచలు లెక్కించాల్సి వస్తోంది. బెయిల్ పొందిన తర్వాత కూడా కోర్టు చుట్టూ తిరగాల్సిందే. నెలలు, సంవత్సరాలు తిరగడానికి అయ్యే ఖర్చులు అంతా ఇంతా కాదు. పోలీసులు కోర్టులో సరైన ఆధారాలు చూపించినపుడు నిందితుడికి జీవిత కారాగార శిక్షలు పడే అవకాశాలున్నాయి. దీంతో మత్తులో, ఆవేశంలో చేసిన నేరానికి కుటుంబం మొత్తం జీవితాంతం వేదన అనుభవించాల్సి వస్తోంది. వ్యసనాలతోనే ఎక్కువగా అనర్థాలు జరుగుతున్నాయని స్పష్టమవుతోంది. వ్యసనాలకు దూరంగా ఉండాలని, క్షణికావేశంలో నేరాలకు పాల్పడి జైలు పాలు కావొద్దని పోలీసులు సూచిస్తున్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ఆయన మంగళవారం కామారెడ్డి పెద్ద చెరువు వద్దనున్న ఫిల్టర్ బెడ్‌ను పరిశీలించారు. ఫిల్టర్ బెడ్ పరిసర ప్రాంతాలను శుభ్రం చేయాలని ఆదేశించారు. పెద్ద చెరువు కట్ట వద్ద బండ్ ప్లాంటేషన్‌లో భాగంగా ఈత మొక్కలు నాటారు. చెరువు కట్టపైనున్న పిచ్చి మొక్కలు తొలగించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ, వైస్ చైర్‌పర్సన్ ఉరుదొండ వనిత, డీఎఫ్‌వో నిఖిత, మున్సిపల్ కమిషనర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.



ఫిల్టర్ బెడ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

జయశంకర్ సార్‌కు నివాళి..

కామారెడ్డి క్రైం: కలెక్టరేట్‌లో మంగళవారం ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు నిర్వహించారు. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం చివరి శ్వాస వరకూ పోరాడిన వ్యక్తి ప్రొఫెసర్ జయశంకర్ అన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఏవో మసూద్ అహ్మద్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



జయశంకర్ సార్‌కు నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ సంగ్వాన్, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, అధికారులు

సామాజిక బాధ్యత నెరవేర్చాలి



కొత్తాబాది మోడల్ స్కూల్‌లో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే పోచారం, ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ బాలరాజు

- 'స్వచ్ఛదనం, పచ్చదనం'లో భాగస్వాములవ్వాలి
- ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ రూరల్: స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో పాల్గొని సామాజిక బాధ్యతను నెరవేర్చాలని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రజలను కోరారు. మంగళవారం ఆయన ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజుతో కలిసి కొత్తాబాదిలో నిర్వహించిన స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలన్నారు. మోడల్ స్కూల్ ఆవరణలో అటవీశాఖ అధికారుల సహకారంతో ప్రహరీ వెంట పండ్ల మొక్కలు నాటించాలని పాఠశాల ప్రిన్సిపాల్ ఫకీరయ్యకు సూచించారు. ప్రహరీ చుట్టూ సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. పాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్‌కు చిత్రపటం వద్ద నివాళులర్పించి, ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆర్డీవో రమేశ్ రాథోడ్, తహసీల్దార్ వరప్రసాద్, ఎంపీడీవో బషీరుద్దీన్, ఎంఈవో నాగేశ్వరరావు, బాన్సువాడ మున్సిపల్ చైర్మన్ గంగాధర్, డీసీసీబీ మాజీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, బుడిమి సొసైటీ చైర్మన్ గంగుల గంగారాం, నాయకులు అంజిరెడ్డి, ఎజాస్, నర్సింలు, సాయాగౌడ్, ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

భారీ బందోబస్తు

ఎమ్మెల్యే పోచారం పర్యటనను స్థానిక కాంగ్రెస్ నాయకులు అడ్డుకుంటారన్న ఇంటెలిజెన్స్ సమాచారంతో పోలీసు శాఖ అప్రమత్తమైంది. పోచారం పర్యటన సందర్భంగా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

కాంగ్రెస్ నేతల ముందస్తు అరెస్ట్

బాన్సువాడ: ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి పర్యటనను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తారన్న సమాచారంతో కాంగ్రెస్‌లోని ఓ వర్గం నేతలను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. వివరాలిలా ఉన్నాయి. ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం కొత్తాబాదిలో పర్యటించారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల బిల్లులకోసం ఎదురుచూస్తున్నవారు పోచారం పర్యటనను అడ్డుకోవాలని కాంగ్రెస్‌లోని ఓ వర్గం రెచ్చగొట్టినట్లు తెలిసింది. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ముందస్తుగా కొత్తాబాది గ్రామానికి చెందిన కాంగ్రెస్ నేతలను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీనిపై మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి వర్గం నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీస్‌స్టేషన్ సమీపంలో ప్రధాన రహదారిపై ధర్నాకు దిగారు. సొంత పార్టీ కార్యకర్తలనే అరెస్టు చేయించడం శోచనీయమన్నారు. ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ధర్నాలో కాంగ్రెస్ నేతలు కొత్తకొండ భాస్కర్, మాసాని శ్రీనివాస్‌రెడ్డి, మంత్రి గణేశ్, బాడి శ్రీనివాస్, అక్బర్, లాయక్, కరీం, అంబర్‌సింగ్, రాజేశ్వర్, యూనుస్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నాలుగేళ్లుగా మధ్యాహ్న భోజనం బంద్

- తాండూర్ హైస్కూల్‌లో విద్యార్థులకు ఇంటి భోజనమే దిక్కు
- ఏజెన్సీ నిర్వాహకుల నిరాసక్తతతో తప్పని ఇబ్బందులు





తాండూర్ హైస్కూల్‌లో ఇంటి నుంచి తెచ్చుకున్న భోజనాన్ని తింటున్న విద్యార్థులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నిరుపేద విద్యార్థుల కడుపు నింపడంతోపాటు విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం నాగిరెడ్డిపేట మండలంలోని తాండూర్ హైస్కూల్‌లో నాలుగేళ్లుగా నిలిచిపోయింది. ఫలితంగా వివిధ గ్రామాల నుంచే వచ్చి విద్యార్థులకు ఇంటి భోజనమే దిక్కవుతోంది. అలాగే జప్తిజాన్కంపల్లి ప్రాథమికోన్నత పాఠశాలతోపాటు మాటూర్ ప్రాథమిక పాఠశాలలోనూ ఈ ఏడాది జూన్ నుంచి మధ్యాహ్న భోజన పథకం నిలిచిపోయింది. జప్తిజాన్కంపల్లి పాఠశాలలో 1 నుంచి 7వ తరగతి వరకు 65 మంది విద్యార్థులు చదువుతున్నారు. మధ్యాహ్న భోజన పథకం నిలిచిపోవడం వల్ల పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య క్రమక్రమంగా తగ్గిపోతోంది.

బిల్లులు సకాలంలో రాకపోవడం వల్లే..

బిల్లులు సకాలంలో రాకపోవడంతో ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండేందుకు ఏజెన్సీ నిర్వాహకులు ముందుకు రావడంలేదు. నెలల తరబడి బిల్లు బకాయిలు పేరుకుపోతుండడంతో అప్పులు చేసి పాఠశాలల్లో విద్యార్థులకు వండి పెడుతున్నారు. దీంతోపాటు కొన్ని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య మరీ తక్కువగా ఉండడం వల్ల స్లాబ్‌రేటు గిట్టుబాటు కాక మధ్యాహ్న భోజనం వండడంలేదు. తాండూర్ పాఠశాలలో మధ్యాహ్న భోజనం వండించేందుకు విద్యార్థుల తల్లిదండ్రులతోపాటు గ్రామస్తులతో ఉపాధ్యాయులు పలుమార్లు సమావేశాలు నిర్వహించినా ఫలితం లేకుండా పోయింది.

ఎవరూ ముందుకు రావడంలేదు

పాఠశాలలో నాలుగేళ్లుగా మధ్యాహ్న భోజన పథకం నిలిచిపోయింది. 2020లో కరోనా విజృంభించిన సమయంలో పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని నిలిపివేశారు. నేను ఇటీవలే బదిలీల్లో భాగంగా తాండూర్ పాఠశాలకు వచ్చాను. తల్లిదండ్రులతోపాటు గ్రామస్తులతో పలుమార్లు సమావేశాలు నిర్వహించి పాఠశాలలో మధ్యాహ్న భోజనం వండాలని కోరినా ఎవరూ ముందుకు రాలేదు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లాను.

– వెంకట్‌రెడ్డి, హెచ్‌ఎం, తాండూర్ హైస్కూల్, నాగిరెడ్డిపేట మండలం

ఉత్తమ సేవలకు గుర్తింపు

కామారెడ్డి క్రైం : విధుల్లో ఉత్తమ సేవలు అందించిన జిల్లాకు చెందిన ఇద్దరు సీఐలకు ప్రశంస పత్రాలు దక్కాయి. మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో డీజీపీ జితేందర్ చేతుల మీదుగా వారు ప్రశంస పత్రాలను అందుకున్నారు. ప్రసుత్త కామారెడ్డి పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి గతంలో రామాయంపేట సీఐగా పనిచేశారు. ఆ సమయంలో మెదక్ జిల్లా శంకరంపేట పీఎస్ పరిధిలో జరిగిన ఓ హత్యకేసులో సరైన పద్ధతిలో పరిశోధన చేపట్టి, నిందితుడికి శిక్ష పడడంలో విశేషంగా కృషి చేశారు. ప్రస్తుతం పిట్లం సీఐగా పనిచేస్తున్న ఆర్.కృష్ణ.. గతంలో బిచ్కుందలో విధులు నిర్వర్తిస్తున్నప్పుడు జరిగిన హత్యకేసులో సాక్ష్యాలను సేకరించి, నేరస్తుడికి జీవితఖైదు పడేలా చూశారు. ప్రశంస పత్రాలు పొందిన సీఐలకు ఎస్పీ సింధు శర్మ అభినందనలు తెలిపారు.





డీజీపీ జితేందర్‌నుంచి ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న కామారెడ్డి సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, పిట్లం సీఐ కృష్ణ

కళాశాలలో లెక్చరర్లను నియమించాలి

- నాగిరెడ్డిపేట విద్యార్థుల డిమాండ్
- మండలకేంద్రంలో రాస్తారోకో

నాగిరెడ్డిపేట: నాగిరెడ్డిపేట ప్రభుత్వ జూనియర్ కాలేజీలో లెక్చరర్లను నియమించి, పాఠాలు జరిగేలా చూడాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌తో మంగళవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ వేసవి సెలవుల్లో లెక్చరర్లు తమ గ్రామాలకు వచ్చి అడ్మిషన్ తీసుకోవాలని కోరారని, ఇప్పుడేమో కళాశాలలో పాఠాలు చెప్పేవారే లేరని ఆవేదన వ్యక్తం చేశారు. వారం రోజులుగా కళాశాల తాళాలు తీసేవారు లేరన్నారు. ఈ విషయాన్ని ఇంటర్ బోర్డు జిల్లా నోడల్ అధికారితోపాటు ఆర్జేడీ దృష్టికి తీసుకువెళ్లినా ఎలాంటి స్పందన లేదన్నారు. ఏఎస్సై లచ్చీరాం ఘటన స్థలానికి చేరుకొని విద్యార్థులను సముదాయించారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చూస్తామని చెప్పడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు. అనంతరం తహసీల్ కార్యాలయానికి వెళ్లి, తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు తులసీదాస్, భారత్, జాషువా, వంశి, వెంకట్, సమీర్, సాయికిరణ్, శివరాజు, సాయి ప్రకాశ్, సాయిచరణ్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.



రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

క్లుప్తంగా

10 నుంచి కబడ్డీ, వాలీబాల్ పోటీలు

భిక్కనూరు: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఈ నెల 10 నుంచి 12 వరకు మండల స్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మంగళవారం తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన జట్లు ఈ పోటీల్లో పాల్గొనవలసిందిగా వారు కోరారు. పోటీల్లో పాల్గొనే జట్లు 8919433658, 6301040952, 9390628067, 8790796955 లకు ఫోన్ చేసి పేర్లను నమోదు చేసుకోవాలని వారు కోరారు.

కాలభైరవుడి సేవలో వీహెచ్‌పీ తెలంగాణ అధ్యక్షుడు



రామారెడ్డి: విశ్వహిందూ పరిషత్(వీహెచ్‌పీ) తెలంగాణ అధ్యక్షుడు అధ్యక్షుడు భోజనపల్లి నరసింహమూర్తి, భాగ్యనగర్ క్షేత్ర సత్సంగ్ ప్రముఖ పండరీజీతో కలిసి మంగళవారం రామారెడ్డి మండలంలో ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీకాళభైరవుడ్ని దర్శించుకున్నారు. దక్షిణ కాశీగా పేరుగాంచిన ఇసన్నపల్లి(రామారెడ్డి) శ్రీకాళభైరవుని దర్శించుకోవడం అదృష్టంగా భావిస్తున్నట్లుగా వీహెచ్‌పీ తెలంగాణ అధ్యక్షుడు నరసింహమూర్తి ఈ సందర్భంగా తెలిపారు. నాయకులు రాజేశ్వర్ రెడ్డి, తుమ్మల్ల కృష్ణ, బొల్లి రాజు పాల్గొన్నారు.

అటు స్వచ్ఛదనం.. ఇటు పందుల సంచారం



మద్నూర్(జుక్కల్): పారిశుద్ధ్య నిర్వహణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఊరూరా స్వచ్ఛదనం.. పచ్చదనం పేరుతో కార్యక్రమం చేపడుతున్నా మరోవైపు ఆ లక్ష్యం నెరవేరుతున్నట్లు కనపడటం లేదు. మంగళవారం మద్నూర్‌లోని ఉన్నత పాఠశాలలో పందులు, గేదెలు పట్టపగలు సంచరిస్తున్నాయి. వాటి సంచారం వల్ల పాఠశాల పరిసరాలు పాడవుతున్నాయని విద్యార్థులు వాపోతున్నారు. పాఠశాలకు ప్రహరీ లేకపోవడం వల్లే పందులు, గేదెలు, కుక్కలు తరుచూ వస్తున్నాయన్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. మంగళవారం సాక్షి ఈ దృశ్యాలను క్లిక్ మనిపించింది.

రాజరాజేశ్వరాలయంలో భక్తుల రద్దీ

భిక్కనూరు: జంగంపల్లిలోని రాజరాజేశ్వరాలయం శ్రావణమాసం తొలి మంగళవారం సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. రాజరాజేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

బకాయిలు కొండంత.. మంజూరు గోరంత

- అవుట్ సోర్సింగ్ ఏఎన్‌ఎంలకు 13నెలల వేతన బకాయిలు
- ఎట్టకేలకు రెండు నెలల వేతనం విడుదల



మోర్తాడ్(బాల్కొండ): జిల్లాలోని వివిధ పీహెచ్‌సీలు, సబ్ సెంటర్‌లలో పని చేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఏఎన్‌ఎంలకు వేతన బకాయిలు భారీగా పేరుకుపోగా, కేవలం రెండు నెలల వేతనాన్ని చెల్లించి చేతులు దులుపుకున్నారు. జిల్లా, రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారుల మధ్య సమన్వయ లోపంతో ఏడాది కాలానికి పైగా అవుట్ సోర్సింగ్ ఏఎన్‌ఎంలు వెట్టి చాకిరీ చేస్తూనే ఉన్నారు. 2021 సెప్టెంబర్‌లో నోటిఫికేషన్ జారీ చేయగా 2023 జూన్‌లో అవుట్ సోర్సింగ్ విధానంలో 56 మంది ఏఎన్‌ఎంలను నియమించారు. వాస్తవానికి 67 పోస్టులకు ఇంటర్వ్యూలను నిర్వహించారు. కొంత మంది తమకు మరో ఉద్యోగం రావడం, ప్రైవేటు ఆస్పత్రుల్లో చేరడంతో 56 మంది పోస్టింగ్ తీసుకున్నారు. జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారుల మధ్య సరైన అవగాహన లేకపోవడంతో అవుట్ సోర్సింగ్ విధానంలో నియమించిన ఏఎన్‌ఎంలకు వేతనాల గ్రాంట్‌ను విడుదల చేయలేదు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల కోడ్ కారణంగా వేతనాల గ్రాంట్ విడుదల చేయడానికి సాంకేతిక సమస్య అడ్డు వచ్చింది. ఉద్యోగంలో చేరిన నాటి నుంచి ఏఎన్‌ఎంలు తమ వేతనాల కోసం పోరాటం చేస్తూనే ఉన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తరువాత సైతం ఏఎన్‌ఎంలు తమ వేతనాల గోడును ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. 2023 జూన్‌లో నియమితులైన ఏఎన్‌ఎంల కాంట్రాక్ట్‌ను పొడగించినా వేతనాలు చెల్లించడానికి బడ్జెట్ లేకపోయింది. వైద్యారోగ్య శాఖ కమిషనర్ క్రిస్టినా చోంగ్తును ఉద్యోగులు కలిసి తమ గోడు వెళ్లబోసుకోగా.. ఆమె ఆర్థిక శాఖ ఆమోదం తీసుకుని నిధుల మంజూరుకు కృషి చేశారు. అయితే, 13 నెలల వేతనాలకుగాను కేవలం 2 నెలల వేతనాలే జమ చేశారు. మరి కొద్దిరోజుల్లో నిధులు విడుదల చేసిన తరువాత పూర్తి స్థాయిలో వేతనం చెల్లిస్తామని ఉన్నతాధికారులు వెల్లడించారని, వేతనాలు రాకపోవడంతో ఇంటి అద్దె, కుటుంబ పోషణ, పిల్లల చదువుల కోసం పుస్తెలను సైతం తాకట్టుపెట్టుకోవాల్సి వచ్చిందని అవుట్ సోర్సింగ్ ఏఎన్‌ఎంలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వీలైనంత తొందరగా పూర్తి స్థాయిలో వేతనాలను చెల్లించాలని కోరుతున్నారు.

‘స్వచ్ఛదనం–పచ్చదనం’ను విజయవంతం చేయాలి

- అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి



ఎల్లారెడ్డి మున్సిపల్ ఆవరణలో నాటే మొక్కలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

ఎల్లారెడ్డి: స్వచ్ఛదనం– పచ్చదనం కార్యక్రమంలో మొక్కలను నాటాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో నాటేందుకు సిద్ధంగా ఉన్న మొక్కలను పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మొక్కల్ని నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్యక్రమాన్ని షెడ్యూల్ ప్రకారం నిర్వహించి విజయవంతం చేయాలని అన్నారు. సీడీఎంఏ ఎస్ఈ అన్నపూర్ణ, మున్సిపల్ కమిషనర్ శ్రీహరిరాజు, కౌన్సిలర్లు నీలకంఠం, భూంగారి రాము తదితరులున్నారు.

తాడ్వాయిలో పర్యటన

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంతోపాటు ఎర్రాపహాడ్ గ్రామంలో మంగళవారం అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి పర్యటించారు. తాడ్వాయిలోని మురికికాలువలు, మంచినీటి ట్యాంకులు, గుంతలను పరిశీలించారు. స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎర్రాపహాడ్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. వైద్య సిబ్బంది సక్రంగా వస్తున్నారా లేదా, అన్నిరకాల మందులు ఇస్తున్నారా లేదా అని రోగులను అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఎంపీడీవో సయ్యద్ సాజీద్‌అలీ,అధికారులు పాల్గొన్నారు.

చిన్న సంఘాలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): చిన్న సంఘాలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలని సీసీ నర్సిములు అన్నారు. ఎర్రాపహాడ్‌లో మంగళవారం సిరివెన్నల గ్రామ సమాఖ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పొదుపు సంఘాల రికార్డులను పరిశీలించారు. ఆర్థిక లావాదీవీలపై చర్చించారు. ప్రతి నెలా 10 లోపు స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ రుణాలు చెల్లించేలా తీర్మానాలు చేశారు. వీవోఏ రాజేశ్వరి, పాలకవర్గం సభ్యులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత పాటించాలి



మద్నూర్(జుక్కల్): ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని బాలుర గురుకుల పాఠశాలలో మంగళవారం నిర్వహించిన స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి ర్యాలీ నిర్వహించారు. పాఠశాలలో మొక్కలు నాటారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో ప్రతిరోజూ సానిటేషన్ చేయాలన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, తహసీల్దార్ ముజీబ్, ఎంపీడీవో పరుచూరి రాణి, తదితరులున్నారు.

ఆపదలో ఆపన్నహస్తం సీఎంఆర్‌ఎఫ్



బాన్సువాడ రూరల్: అనారోగ్యానికి గురై ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న ఆపన్నుల పాలిట సీఎం రిలీఫ్ ఫండ్ ఆపన్నహస్తంగా నిలుస్తోందని డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి అన్నారు. మంగళవారం బోర్లం గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు జంగం బసప్పకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును గ్రామ ప్రజాప్రతినిధులతో కలిసి పంపిణీ చేశారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి కృషితో నిరుపేదలకు పథకాల ద్వారా నేరుగా లబ్ధి చేకూరుతోందన్నారు. నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, పర్వంరెడ్డి, నర్సింలు, రాజేశ్వర్‌గౌడ్, సయ్యద్ జలీల్ ఉన్నారు.

పంటలు నీటిలో మునగాల్సిందేనా ?



మద్నూర్(జుక్కల్): మండలంలో జాతీయ రహదారి–161 నిర్మించడంతో చాలా మంది ప్రయాణాలు సులభమై ఆనందంగా ఉంటే కొందరు రైతులు మాత్రం ఆవేదన చెందుతున్నారు. రోడ్డు నిర్మాణం చేసిన కాంట్రాక్టర్లు వరద నీరు వెళ్లడానికి డ్రైనేజీలు నిర్మించకపోవడంతో వ్యవసాయ భూముల్లో వర్షపు నీరు చెరువుల్లా నిండిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న వ్యవసాయ భూముల్లో నిలిచిన నీరు బయటకు వెళ్లే అవకాశం లేకపోవడంతో పంటలు పూర్తిగా దెబ్బతింటున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

నాణ్యతకు భరోసా భారతి సిమెంట్

- డీలర్ల సమావేశంలో సంస్థ మార్కెటింగ్ ఉపాధ్యక్షుడు ఎంసీ మల్లారెడ్డి



జ్యోతిప్రజ్వలన చేస్తున్న మల్లారెడ్డి, కొండల్‌రెడ్డి, ఓబుల్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు తదితరులు

నిజామాబాద్‌నాగారం: నాణ్యతకు భరోసాగా భారతి సిమెంట్ ప్రత్యేక గుర్తింపు పొందిందని ఆ సంస్థ మార్కెటింగ్ ఉపాధ్యక్షుడు ఎంసీ మల్లారెడ్డి అన్నారు. నిజామాబాద్ నగరంలోని వంశీ కాన్ఫరెన్స్‌హాల్‌లో భారతి సిమెంట్ డీలర్ల సమావేశాన్ని మంగళవారం నిర్వహించగా, మల్లారెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతి సిమెంట్ ఉత్పత్తి ప్రారంభించిననాటి నుంచి వినియోగదారుల నమ్మకాన్ని చూరగొంటోందన్నారు. జర్మన్ టెక్నాలజీ, రోబోటిక్ ల్యాబొరేటరీ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సిమెంట్ ఉత్పత్తి చేస్తున్నామని, మార్కెట్‌లో భారతి సిమెంట్‌కు విశేషమైన ఆదరణ లభిస్తోందన్నారు. తాపీమేస్త్రీలకు సంస్థ ద్వారా వ్యక్తి గత ప్రమాదబీమా పథకాన్ని అమలు చేస్తూ వారిని ఆదుకుంటున్నామని వివరించారు. అనంతరం ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా భారతి సిమెంట్ కంపెనీలో సిమెంట్ ఉత్పత్తి, ప్యాకింగ్, లోడింగ్ తదితర అంశాలపై డీలర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మార్కెటింగ్ సహ ఉపాధ్యక్షుడు టి.కొండల్‌రెడ్డి, డీజీఎం(టెక్నికల్ సర్వీసెస్) సి.ఓబుల్‌రెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ వి.నాగేశ్వర్‌రావు, టెక్నికల్ సర్వీసెస్ మేనేజర్ కె.సునీల్, సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తినలేం..

- గ్రామస్తులు, అధికారులకు విద్యార్థుల లేఖ
- ఏజెన్సీ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని వేడుకోలు



మధ్యాహ్న భోజనంలో పురుగులు

మాచారెడ్డి: మండలంలోని ఘన్‌పూర్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో పురుగులు వస్తున్నా పట్టించుకునే నాథుడే లేడని ఏకంగా విద్యార్థులే గ్రామస్తులకు రాసిన లేఖ మంగళవారం కలకలం సృష్టించింది. గత కొద్దిరోజులుగా మధ్యాహ్న భోజనం, అంబలిలో పురుగులు వస్తున్నా పట్టించుకోవడం లేదని విద్యార్థులు లేఖలో ఆవేదన వ్యక్తం చేశారు. హెచ్‌ఎంకు ఎన్నిసార్లు చెప్పినా దాట వేస్తు వచ్చారని ఆందోళన వ్యక్తం చేస్తూ లేఖను కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్‌తో పాటు గ్రామస్తులకు రాశారు. ఏజెన్సీ నిర్వాహకులను మార్చాలని తాము ఎన్నోసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని, పప్పు తక్కువ వేసి నీళ్లచారునే వడ్డిస్తున్నారని విద్యార్థులు లేఖలో పేర్కొన్నారు. తల్లిదండ్రుల సమావేశంలో తాము మధ్యాహ్న భోజనం అధ్వానంగా ఉందని చెప్పగా, హెచ్‌ఎం బెదిరించి తిట్టారని పేర్కొన్నారు. తమ సమస్యను పరిష్కరించాలని డీఈవో, ఎంఈవోలకు మొరపెట్టుకున్నారు.

పోస్టాఫీస్ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు



భిక్కనూరు: పోస్టాఫీస్ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయని తపాలశాఖ ఇన్‌స్పెక్టర్ సుజిత్ కుమార్ అన్నారు. మంగళవారం అంతంపల్లిలో పోస్టల్ శాఖ చిన్న మొత్తాల పొదుపు పథకాల గురించి ఆయన అవగాహన కల్పించారు. పోస్టాఫీస్‌లో సేవింగ్ ఖాతా ఉన్నవారికి ఏటీఎం కార్డులను అందజేస్తామన్నారు. డిపాజిట చేసిన డబ్బులకు బ్యాంకుల కంటే ఎక్కువ వడ్డీ అందజేస్తామన్నారు. ఐపీపీబీ మేనేజర్ పవన్‌రెడ్డి, జంగంపల్లి ఎస్‌పీఎం ఉపేందర్, తపాలశాఖ అధికారి మహబూబారెడ్డి, బీపీఎంలు పాల్గొన్నారు.

బీడీ కార్మికుల రాజీనామాలు ఫారం-ఐ ద్వారా స్వీకరించాలి



కామారెడ్డి రూరల్: కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ బీడీ కామ్‌గార్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బీడీ కంపెనీల ఎదుట మంగళవారం ఆందోళన, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పు లక్ష్మణ్ మాట్లాడుతూ.. బీడీ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, బీడీలకు సరిపడే తునికాకు వెయ్యాలని, నెలకు 25 రోజులు పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. బీడీ పరిశ్రమలలో పనిచేసే కార్మికుల రాజీనామాలు గుర్తింపు పొందిన యూనియన్ ఫారం–ఐ ద్వారా స్వీకరించాలని, సర్వీస్‌ను సక్రమంగా చేపట్టాలని కోరారు. నూతన బీడీ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివ్వంది సత్యం పాల్గొన్నారు.


9న దివ్యాంగ విద్యార్థుల ఉచిత పరికరాల నిర్ధారణ శిబిరం

కామారెడ్డి అర్బన్: దివ్యాంగ విద్యార్థులకు సహాయ ఉపకరణాలు అందించడానికి ఈనెల 9న శుక్రవారం కామారెడ్డి జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో దివ్యాంగ నిర్ధారణ శిబిరం నిర్వహించనున్నట్లు డీఈవో ఎస్.రాజు, జిల్లా సహిత విద్య సమన్వయకర్త కృష్ణ చైతన్యలు ఒక ప్రకటనలో తెలిపారు. 18 ఏళ్ల లోపు దివ్యాంగ విద్యార్థులకు వినికిడి యంత్రాలు, వీల్‌చైర్, మూడు చక్రాల సైకిల్, స్కూటర్, చంక కర్రలు, కృత్రిమ అవయవాలు, స్మార్ట్‌ఫోన్లు పొందడానికి ఈ శిబిరానికి హాజరు కావాలని వారు సూచించారు. ఆధార్‌కార్డు, సదరం సర్టిఫికెట్, ఆదాయ ధ్రువ పత్రం లేదా రేషన్‌కార్డు జిరాక్స్, రెండు ఫోటోలు వెంట తీసుకురావాలని అన్నారు. వివరాలకు 80080 70090 నంబర్‌కు సంప్రదించాలన్నారు.

స్కావెంజర్ నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

రాజంపేట: మండల కేంద్రంలోని కేజీబీవీలో స్కావెంజర్ నియామకానికి నేడు(బుధవారం) దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పాఠశాల స్పెషల్ ఆఫీసర్ శ్రీవాణి మంగళవారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు చెప్పారు. పదవ తరగతి ఉత్తీర్ణులై, 25–40 సంవత్సరాల వయసు కలిగిన స్థానికులు మాత్రమే ఈ దరఖాస్తుకు అర్హులని పేర్కొన్నారు.

ఆర్టీసీ సిబ్బందిపై దాడి చేస్తే ఇక జైలుకే..



భిక్కనూరు: విధుల్లో ఉన్న ఆర్టీసీ సిబ్బందిపై ఎవరు దాడి చేసినా ఇక జైలుకు వెళ్లాల్సి ఉంటుంది. ఈమేరకు బస్సుల్లో ఆర్టీసీ యాజమాన్యం హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసింది. తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు అన్ని బస్సుల్లో ఈ హెచ్చరిక బోర్డులను పెట్టారు. భారత న్యాయ సంహిత(బీఎన్ఎస్)–121, 122, 132 సెక్షన్‌ల ప్రకారం రెండు నుంచి 10 ఏళ్ల వరకు జైలు శిక్ష, జరిమాన విధించనున్నట్లు బోర్డులను ఏర్పాటు చేశారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

Finance Services

■ సిరి అసోసియేట్స్ అన్ని రకాల రుణాలు, పర్సనల్ హౌసింగ్ మార్ట్ గేజ్ ఓపెన్ ప్లాట్స్ పై కూడా సిబిల్ ప్రాబ్లం ఉన్న చేయించబడును. సంప్ర: సెల్: 9666142226. [W-1239823]

BUSINESS OFFER

■ మీరు బైబ్యాక్ అగ్రిమెంట్‌తో లాభదాయకమైన లేడీస్ శానిటరీ ప్యాడ్, బేబీ డైపర్ మెషిన్, ప్లాస్టిక్ ఉద్యోగ్ వ్యాపారాన్ని ప్రారంభించండి.(ప్రభుత్వ ఆమోదితము) 8376001873, 9643010487, 8376089771, 011-25920179. [DA-5872]

CHANGE OF NAME

■ I, NOORJAHAN (Old Name) W/o. SYED AHMED Changed of my Name as NOOR JAHAN BEGUM (New Name) W/o. SYED AHMED R/o. H.No: 8-7-664, Dharugally, Nizamabad. 503001. [Z-795586]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి నిజామాబాద్ CONTACT: 9492010949

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించి పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్రైం కార్నర్

ఉద్యోగం పోయిందని ఆత్మహత్యాయత్నం



ఎల్లారెడ్డి: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన మాలి ఉద్యోగం చేసిన చిన్న సాయిలు అనే వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కొద్ది సంవత్సరాలుగా చిన్న సాయిలు ఆస్పత్రిలో మాలి ఉద్యోగం చేస్తున్నాడు. అయితే, రెగ్యులర్ ఉద్యోగి రావడంతో తన ఉద్యోగం పోయిందని మనస్తాపంతో సోమవారం రాత్రి ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు. సాయిలుకు ఉద్యోగం కల్పించి తమను ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

సీసీ కెమెరాలు ధ్వంసం



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని గోపాల్‌పేటలో లక్షల రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. రెండేళ్ల క్రితం నాగిరెడ్డిపేట మండలకేంద్రం గోపాల్‌పేటలో పలువురు వ్యాపారుల సహకారంతో సుమారు 15 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. గత కొన్నిరోజులుగా సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో సాంకేతిక సమస్య కావొచ్చని పోలీసులు భావించి టెక్నీషియన్‌కు సమాచారం అందించారు. సోమవారం టెక్నీషియన్ పరిశీలించగా.. గ్రామంలో ఒకటి రెండు మినహా మిగతా సీసీ కెమెరాలు ధ్వంసమయ్యాయని గుర్తించి పోలీసులకు తెలిపాడు. గ్రామంలో చోరీలు చేసేందుకు దుండగులు సీసీ కెమెరాలను ధ్వంసం చేశారా? లేక రాత్రివేళ ఇసుక అక్రమ రవాణాకు పాల్పడేవారు చేశారా? అనేది తేలాల్సి ఉంది.

వృద్ధుడి అదృశ్యం

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని న్యాల్‌కల్‌కు చెందిన ముత్యంరావు అనే వృద్ధుడు అదృశ్యమైనట్లు ఎస్సై గంగాధర్ మంగళవారం తెలిపారు. ఈనెల 3వ తేదీన ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన ముత్యంరావు తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు పలు చోట్ల వెతికారన్నారు. ఆచూకీ లభించకపోవడంతో ముత్యంరావు భార్య రజిత ఫిర్యాదు చేసిందని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

మిర్చి లోడ్‌తో వెళ్తున్న డీసీఎం బోల్తా

కమ్మర్‌పల్లి: మిర్చి లోడ్‌తో వెళ్తున్న డీసీఎం వ్యాన్ మండల కేంద్రంలో మంగళవారం ఉదయం బోల్తాపడింది. మహారాష్ట్రలోని బోకర్దాన్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్టణానికి వెళ్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. ఉప్లూర్ క్రాస్ రోడ్డువద్ద ఆటోను తప్పించే క్రమంలో ఓ షాపు ముందు రేకుల షెడ్డును ఢీకొని డీసీఎం బోల్తాపడింది. ఈ ఘటనలో డ్రైవర్ రామారావుకు గాయాలుకాగా, ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. బోల్తా పడిన వ్యాన్‌ను జేసీబీతో రోడ్డుపై నుంచి తొలగించారు.

కత్తెరతో పొడిచి అన్న హత్య

- బాన్సువాడ పట్టణంలో ఘటన



కృష్ణ (ఫైల్)

బాన్సువాడ : క్షణికావేశంలో తమ్ముడు తన అన్నను కత్తెరతో పొడిచి హత్య చేశాడు. సోమవారం రాత్రి బాన్సువాడలో చోటుచేసుకున్న ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణంలోని దాల్‌మల్‌గుట్టకు చెందిన వకీల్‌గారి గంగామణికి ముగ్గురు కుమారులు కాగా, పక్కపక్కనే వేర్వేరు ఇళ్లలో ఉంటున్నారు. పెద్ద కుమారుడు కృష్ణ తన భార్యతో మనస్పర్థల కారణంగా తల్లితో కలిసి ఉంటుండగా, అతడి భార్య భార్య మంజుల ఇద్దరు పిల్లలతో కలిసి తాడ్కోల్ శివారులోని డబుల్ బెడ్ రూం కాలనీలో ఉంటోంది. మేస్త్రీ పని చేసే కృష్ణ పని ముగించుకుని సోమవారం రాత్రి ఇంటికి వచ్చాడు. కాళ్లు కడుక్కునేందుకు గచ్చులోకి వెళ్లి అక్కడ చీకటి ఉండడంతో లైట్ వేయాలని తమ్ముడు రాజుకు చెప్పాడు. తన భార్యతో కలిసి భోజనం చేస్తున్న రాజు.. అన్నం తిన్న తరువాత వేస్తానని సమాధానమిచ్చాడు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న కృష్ణ.. రాజు ఇంటి తలుపులను నెడుతూ గొడవకు దిగడంతో అతడు తన తల్లికి ఫోన్‌లో విషయం తెలుపగా ఆమె ఇంటికి చేరుకుంది. ఆ తరువాత ఇద్దరు గొడపవపడ్డారు. ఒకరినొకరు నెట్టుకుంటున్న క్రమంలో రాజు కుట్టు మిషన్‌పై ఉన్న కత్తెరను తీసుకొని కృష్ణ చేయి, మెడపై పొడిచాడు. తల్లి గంగామణి కాలనీ వాసులను పిలిచి కృష్ణను ఆస్పత్రికి తరలించినప్పటికీ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. తన పెద్ద కుమారుడు కృష్ణ మృతికి కారణమైన చిన్న కుమారుడు రాజుపై చర్యలు తీసుకోవాలని తల్లి గంగామణి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదవశాత్తు బావిలోపడి మృతి

జక్రాన్‌పల్లి: మండలంలోని నల్లగుట్ట తండాకు చెందిన మూడ్ దినేశ్ అనే వ్యక్తి ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలోపడి మృతి చెందినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. నల్లగుట్ట తండాకు చెందిన దినేశ్ చిన్ననాటి నుంచి అంగవైకల్యంతో బాధపడుతున్నాడు. అయితే ఈ నెల 5న సాయంత్రం 6 గంటలకు ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటికి వెళ్లిపోయాడు. మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో దినేశ్ మృతదేహం కనిపించింది. ఇంట్లో నుంచి బయటికి వెళ్లి తిరుగుతున్న సమయంలో బావి వద్దకు వెళ్లి ప్రమాదశాత్తు నీటి బావిలోపడి ఈత రాక దినేశ్ మృతి చెందాడని ఎస్సై తెలిపారు. మృతుడి అన్న మూడ్ గణేశ్ ఫిర్యాదు మేరు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చికిత్సపొందుతూ గుర్తు తెలియని వృద్ధుడు..

ఖలీల్‌వాడి: గుర్తు తెలియని వృద్ధుడు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు నాల్గో టౌన్ పోలీస్‌స్టేషన్ ఎస్సై శ్రీకాంత్ మంగళవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఎల్లమ్మగుట్ట ప్రాంతంలో తిరుగుతున్న సుమారు 65 ఏళ్ల గుర్తు తెలియని వృద్ధుడు అనారోగ్యానికి గురికావడంతో స్థానికులు పోలీసులకు సోమవారం సమాచారం అందించారు. బాధితుడిని జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి వివరాలు తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

పేకాట స్థావరాలపై దాడి

బోధన్‌రూరల్: మండలంలోని అమ్దాపూర్ గ్రామంలో కొనసాగుతున్న పేకాటస్థావరంపై మంగళవారం సాయంత్రం పోలీసులు దాడి చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడి చేసి ఐదుగురిని అరెస్ట్ చేశామని, పట్టుబడిన వారి నుంచి రూ.4,840 నగదు స్వాధీనం చేసుకున్నామని రూరల్ ఎస్సై నాగనాథ్ తెలిపారు.

ముల్లంగి శివారులో..

డిచ్‌పల్లి: మండలంలోని ముల్లంగి శివారులో పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ సీఐ పురుషోత్తం సిబ్బందితో కలిసి దాడి చేశారు. ముగ్గురు పేకాటరాయుళ్లు పట్టుబడగా, మరో ముగ్గురు పరారయ్యారు. పట్టుబడిన వారి నుంచి రూ.4,800 నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

ఆర్మూర్‌లో..

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోటార్మూర్, పెర్కిట్ ప్రాంతాల్లో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. ఎనిమిది మందిని అదుపులోకి తీసుకొని సెల్‌ఫోన్లు, రూ.67,440 నగదు స్వాధీనం చేసుకొని స్థానిక పోలీసులకు అప్పగించారు. దాడిలో టాస్క్‌ఫోర్స్ సీఐ పురుషోత్తం, ఎస్సై అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

మాయమాటలు చెప్పి వివాహితపై అత్యాచారం

- ఇద్దరిపై కేసు నమోదు

కామారెడ్డి క్రైం: భర్తతో దూరంగా ఉంటున్న ఓ వివాహితకు మాయమాటలు చెప్పి ఆమెపై ఇద్దరు యువకులు అత్యాచారానికి పాల్పడిన ఘటన జిల్లా కేంద్రంలో వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి.. భర్తతో గొడవల కారణంగా తల్లిగారింటి వద్దే ఉంటున్న మహిళకు పరిచయం ఉన్న ఇద్దరు యువకులు మాయమాటలు చెప్పి గత జనవరిలో పలుసార్లు అత్యాచారానికి పాల్పడినట్లు తెలిసింది. గర్భం దాల్చడంతో సదరు మహిళ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు సమాచారం.

మానసిక స్థితి సరిగాలేని వ్యక్తి ఆత్మహత్య

బాన్సువాడ రూరల్: మానసిక స్థితిబాగా లేకపోవడంతో మండలంలోని తిర్మలాపూర్ గ్రామానికి చెందిన గొల్ల సాయిలు (70) చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు బాన్సువాడ సీఐ కృష్ణ తెలిపారు. సాయిలు గతంలోనూ పురుగుల మందు సేవించగా కుటుంబసభ్యులు ఆస్పత్రిలో చికిత్స చేయించారు. ఈనెల 5వ తేదీన ఇంటి నుంచి వెళ్లిన గొల్ల సాయిలు తిరిగిరాకపోవడంతో అతడి ఆచూకీ కోసం వెతుకుతుండగా చెరువు గట్టుపై చేతికర్ర, టవల్ కనిపించడంతో జాలర్లసహాయంతో చెరువులో గాలించారు. సాయిలు మృతదేహం లభించడంతో పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

సిరికొండ: మండలంలోని తాళ్లరామడుగు గ్రామ పరిధిలోని కప్పలవాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్‌హెచ్‌వో బాల్‌సింగ్ మంగళవారం తెలిపారు. తమను చూసి డ్రైవర్ ట్రాక్టర్‌ను వదిలేసి పారిపోయాడని, ట్రాక్టర్‌ను పిట్ల లింబాద్రికి చెందినదిగా గుర్తించామన్నారు. ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

పాఠశాలలో చోరీ

ఖలీల్‌వాడి: నగరంలోని రెండో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న శంకర్ భవన్ స్కూల్‌లో చోరీ జరిగినట్లు హెచ్ఎం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. సోమవారం రాత్రి చోరీకి పాల్పడిన దుండగులు రెండు ట్యాబ్‌లను ఎత్తుకెళ్లారని ఫిర్యాదులు పేర్కొన్నట్లు సమాచారం. గతంలోనూ చోరీలు జరిగినా పోలీసులు పట్టించుకోలేదనే విమర్శలు ఉన్నాయి.